క్లుప్తంగా

శ్రీవేణుగోపాలస్వామికి పంచామృతాలతో అభిషేకం



పెడన: పట్టణంలోని శ్రీరుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న ధనుర్మాస వ్రత మహోత్సవాల సందర్భంగా శనివారం వేకువ జామున స్వామివారికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. స్వామివారికి తొలుత సుప్రభాత సేవ, ఆండాళ్ల గోష్టి పూజాది కార్యక్రమాలను నిర్వహించారు. మహిళా భక్తులు గోదాదేవి పాడిన పాటలు తిరుప్పావై, శ్రీకృష్ణ పారాయణం అత్యంత భక్తి శ్రద్ధలతో పఠించారు. ఆలయ ప్రధాన అర్చకుడు అగ్నిహోత్రం హరికృష్ణ స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి పంచ హారతులను ఇచ్చారు.

సర్వీసు ప్రొవైడర్ల నుంచి దరఖాస్తులు ఆహ్వానం

పెడన: రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంఘాల సభ్యుల జీవనోపాధుల జాతర–100 రోజుల ప్రణాళికలో భాగంగా మెప్మా ఆధ్వర్యంలో గుర్తింపు పొందిన సర్వీసు ప్రొవైడర్ల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఎం.గోపాలరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రిజిస్ట్రేషన్, ఆన్ బోర్డింగ్, వర్క్ ఆర్డర్ మేనేజ్‌మెంట్ సిస్టం జీవనోపాధి కలిగిన వారి నుంచి దరఖాస్తులను తీసుకుంటామన్నారు. పెడన మునిసిపల్ ఆఫీసులో మెప్మా సెక్షన్‌లో ఈ దరఖాస్తు తీసుకుంటారన్నారు. బ్యూటీషియన్స్‌కు సంబంధించి స్త్రీలు, పురుషులకు సంబంధించి సర్వీసు ప్రొవైడర్లు అయినటువంటి ఎలక్ట్రీషియన్స్, కార్పెంటర్, ప్లంబర్, ఏసీ రిపేరు, ఫ్రిజ్ రిపేరు, వాటర్ ప్యూరిఫైడ్ వర్క్స్, గ్రీసర్ వర్క్స్, వాషింగ్ మెషిన్, టీవీలు రిపేరు, ఇన్‌స్టాలేషన్ పనులకు సంబంధించిన జీవనోపాధి కలిగిన వారు వారి అదనపు కుటుంబ ఆదాయాన్ని పెంపొందించుకోవడానికి ఈ అవకాశం కల్పించామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ కోరారు.

కోడూరు నుంచి బందరుకు బస్సు నడపాలి

అవనిగడ్డ: స్థానిక ఆర్టీసీ డిపో కార్యాలయంలో శనివారం నిర్వహించిన డయల్ యువర్ డీఎం కార్యక్రమంలో ప్రయాణికులు పలు సర్వీసులు నడపాలని విన్నవించారు. అవనిగడ్డ నుంచి కోడూరు మీదుగా మచిలీపట్నంకు బస్ సర్వీస్ నడపాలని స్వతంత్రపురానికి చెందిన పి.శ్రీనివాసరావు డీఎం హనుమంతరావును కోరారు. అవనిగడ్డ నుంచి నరసాపురం సర్వీసు పునరుద్ధరించాలని మచిలీపట్నంకు చెందిన పి.మూర్తి విజ్ఞప్తి చేశారు. అవనిగడ్డ నుంచి శ్రీశైలంకు సాయంత్రం వేళలో బస్ సర్వీస్ నడపాలని కోడూరుకు చెందిన ఆర్.రవీంద్ర వర్మ విన్నవించారు. వీటిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి ఆ సర్వీసులు నడిపేందుకు చర్యలు తీసుకుంటామని డీఎం హనుమంతరావు తెలిపారు.

దివ్యాంగులకు పరికరాలు పంపిణీ

అవనిగడ్డ: నియోజకవర్గంలోని పలు ప్రాంతాలకు చెందిన దివ్యాంగులకు రూ.50 లక్షల విలువైన పరికరాలను మచిలీపట్నం పార్లమెంట్ సభ్యుడు వి.బాలశౌరి శనివారం పంపిణీ చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో పలువురు దివ్యాంగులకు ఎంపీ బాలశౌరి వీటిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామీణ యువజన వికాస సమితి అధ్యక్షుడు మండలి వెంకట్రామ్, రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ చైర్మన్ చిలకలపూడి పాపారావు, ఎంపీపీ తుంగల సుమతీ దేవి, ఎంపీడీవో మరియాదేవితో పాటు పలువురు టీడీపీ, జనసేన నేతలు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఘంటసాల కేవీకేలో స్వచ్ఛత పక్వాడా

ఘంటసాల: పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే అందరూ ఆరోగ్యంగా ఉంటారని ఘంటసాల కేవీకే సమన్వయకర్త డాక్టర్ డి.సుధారాణి తెలిపారు. ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వారి ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రంలో డాక్టర్ సుధారాణి ఆధ్వర్యంలో శనివారం స్వచ్ఛతా పక్వాడా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కృషి విజ్ఞాన కేంద్రం ప్రాంగణంలో పరిసరాలను పరిశుభ్రం చేయడంతో పాటు ముళ్లపొదలు, పిచ్చి మొక్కలను తొలగించారు. కార్యక్రమంలో భాగంగా కేవీకే పరిధిలోని మోపిదేవి, వెంకటాపురం, తాడేపల్లి, రావివారిపాలెం తదితర గ్రామాల్లో స్వచ్ఛత పక్వాడా కార్యక్రమంపై ప్రజల్లో అవగాహన కల్పిస్తామని డాక్టర్ సుధారాణి తెలిపారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు డాక్టర్ వెంకటలక్ష్మి, డాక్టర్ మంజువాణి, యశ్వంత్, డాక్టర్ గోపాల స్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

మాజీ ప్రధాని మన్మోహన్‌కు ఘన నివాళి

కృత్తివెన్ను: మండలంలోని పల్లెపాలెం ఉన్నత పాఠశాలలో శనివారం ఉపాధ్యాయులు, విద్యార్థులు మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. దేశానికి ఎన్నో ఉత్తమ సంస్కరణలు అందించిన గొప్ప దార్శనికత కలిగిన నాయకుడు మన్మోహన్‌సింగ్ అంటూ కొనియాడారు.

సొసైటీలో నిధుల దుర్వినియోగం

- కీలక ఉద్యోగి నిర్వాకమే కారణం
- నెల రోజులుగా విధులకు గైర్హాజరైన సదరు ఉద్యోగి
- షోకాజ్ నోటీసు జారీ చేసిన కేడీసీసీ బ్యాంకు ఉన్నతాధికారులు



నాగాయలంక పీఏసీఎస్ కార్యాలయం

నాగాయలంక: నాగాయలంక పీఏసీఎస్‌పై మరోసారి నిధుల దుర్వినియోగం, అవకతవకల ఆరోపణలు వచ్చాయి. సొసైటీలో కీలక ఉద్యోగి ఒకరు విధులు, రికార్డులు వదిలేసి నెల రోజులకు పైగా కనిపించకుండా పోయినట్లు తెలుస్తోంది. గత సెప్టెంబర్‌లో స్థానిక కేడీసీసీబీ చీఫ్ మేనేజర్ తనిఖీ చేపట్టిన సమయంలో ఈ సొసైటీలో నిధుల దుర్వినియోగం, అక్రమాలు బయటపడ్డాయని తెలిసింది. సేకరించిన సమాచారం మేరకు సొసైటీలోని సీకేసీసీ లోన్ ఫైల్స్ డిక్లరేషన్‌లలో దిద్దడం, ఫైల్స్‌లో ఉండాల్సిన డాక్యుమెంట్స్, పాస్‌బుక్స్ మాయం కావడాన్ని అధికారులు గుర్తించారు. కేడీసీసీబీ బ్రాంచిలో లోన్ బట్వాడా సమయంలో ఉన్న టి.కొత్తపాలెం గ్రామానికి చెందిన ఇరువురు రుణ గ్రహీతల డాక్యుమెంట్స్, పాస్‌బుక్స్ తనిఖీలో జాడ లేకపోవడం గుర్తించి తీగ లాగడంతో ఈ బాగోతం బయటపడింది. నకిలీ పాసుబుక్‌లు, టైటిల్ డీడ్‌లతో మోసం చేసినట్లు అధికారులు ధ్రువీకరించుకున్నారు. వేరే పీఏసీఎస్ కర్షకమిత్ర లోన్స్ బట్వాడాలో రైతునేస్తం లోన్ ఫైల్ వెరిఫికేషన్‌లో అవకతవకలు బయట పడటంతో సదరు రుణ గ్రహీతలు నాగాయలంక సొసైటీ ఉద్యోగి లంచం తీసుకుని నకిలీ పాస్‌బుక్‌లు ఇప్పించినట్లు గుర్తించారు. ఈ ఏడాది సెప్టెంబర్ 2న కర్షక మిత్ర రెన్యువల్ సంబంధిత సీ ఫారాలలో సంతకాల ఫోర్జరీ జరిగినట్టు గుర్తించారు. అవకతవకలకు పాల్పడినట్టు భావిస్తున్న సదరు ఉద్యోగి నిత్యం మద్యం తాగి బ్యాంకుకు పిలిచినా రావడం లేదని జిల్లా కేంద్ర బ్యాంకు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. రికార్డుల పరిశీలనకు సహకరించకుండా బ్యాంకు అధికారుల పైనే కేసులు పెడతానని, తన జోలికి వస్తే చంపుతానని బెదిరిస్తుండటంతో కేడీసీసీ బ్యాంకు సీఈఓ ద్వారా అవనిగడ్డ డీఎస్పీ దృష్టికి తీసుకువెళ్లి, ఆ ఉద్యోగిపై క్రిమినల్ చర్యలకు సూచించారు.

సూపర్‌వైజర్ తనిఖీలో ఇలా...

రైతుల కోసం రప్పించిన ఎరువులు ఇవ్వకుండా నిర్లక్ష్యం, అమౌంట్‌లు, స్టాక్ నిల్వలలో అవకతవకలు గుర్తించారు. సీకేసీసీ పాత రుణాలు రూ.21 లక్షలు బట్వాడాకు సంబంధించిన లోన్ రికవరీపై రసీదు లేకపోవడం, వాయిదా మీరిన రుణాలపై లీగల్ యాక్షన్ లేకపోవడం, క్యాష్ బుక్‌లో సీబీల తాలూకా రూ. 1,56, 330 మాయం, వోచర్లు లేకుండా ఖర్చులు చూపడంపై వారంలో సమాధానం ఇవ్వాలని, లేని పక్షంలో క్రమ శిక్షణ చర్యలు తప్పవని ఆ ఉద్యోగికి లిఖితపూర్వక షోకాజ్ నోటీసు జారీ చేశారు. దీంతో నెల రోజులుగా ఆ ఉద్యోగి అసలు విధుల్లోకే రావడంలేదని తెలిసింది. సొసైటీ నిండా మునగకముందే సహకార శాఖ ఉన్నతాధికారులు సొసైటీలో నిధుల దుర్వినియోగం, అవకతవకలపై విచారణ చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

కేడీసీసీ బ్యాంకు అధికారుల వివరణ

నాగాయలంక సొసైటీ పరిస్థితిపై కేడీసీసీ బ్యాంకు స్థానిక బ్రాంచి చీఫ్ మేనేజర్ మేనేజర్ చింతలపూడి మధుబాబును వివరణ కోరగా సంబంధిత ఉద్యోగిపై ఇప్పటికే జిల్లా హెడ్ ఆఫీసుకు పలు నివేదికలు వెళ్లాయని, ఇంకా ఏ విధమైన చర్యలు చేపట్టలేదన్నారు. రైతులకు ఇబ్బంది లేకుండా తాత్కాలిక ఏర్పాటు చేశామన్నారు. బ్యాంకు సూపర్‌వైజర్ రెహా మున్నీసా ప్రస్తుతం పర్సన్ ఇన్‌చార్జిగా ఉన్నారన్నారు.

నిధుల దుర్వినియోగం నిజమే : పర్సన్ ఇన్‌చార్జి

సొసైటీలో నిధుల దుర్వినియోగం, అవకతవకలు, క్రమశిక్షణా రాహిత్యం, వాస్తవమేనని సొసైటీ పర్సన్ ఇన్‌చార్జి రెహామున్నీసా ధ్రువీకరించారు. సదరు ఉద్యోగి సంజాయిషీ కోరుతూ నవంబరు లోనే షోకాజ్ నోటీసు జారీ చేశామన్నారు. సంబంధిత తనిఖీ రిపోర్టులు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఉన్నతాధికారుల పరిధిలో ఉన్నాయని, ఈ విషయమై తాను అంతకంటే ఏమీ చెప్పలేనని అన్నారు.

పైడమ్మ ఉత్సవాల్లో పర్యవేక్షణ ఏది?

- జనరల్ ఫండ్స్ నుంచి నిధులిస్తున్నాం.. పట్టించుకోకపోతే ఎలా?
- పాట పాడిందొకరు... వసూలు చేసే పేరు మరొకటా
- కౌన్సిల్ సమావేశంలో కౌన్సిలర్ల ఆగ్రహం



మాట్లాడుతున్న కటకం నాగకుమారి

పెడన: పైడమ్మ జాతర మహోత్సవాలకు పురపాలక సంఘం సాధారణ నిధుల నుంచి కేటాయిస్తుంటే మున్సిపల్ అధికారులు పర్యవేక్షణను పూర్తిగా గాలికి వదిలేశారని సభ్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపల్ సమావేశం హాలులో శనివారం ఉదయం కౌన్సిల్ సాధారణ సమావేశం మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం నాగకుమారి అధ్యక్షతన జరిగింది. తొలుత మాజీ ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్ మృతికి కౌన్సిల్ తీవ్ర సంతాపం వ్యక్తం చేసి రెండు నిమిషాలు మౌనం పాటించింది. అనంతరం అజెండాలోని పలు అంశాలు చర్చకు రాగా అన్నిటినీ ఏకగ్రీవంగా ఆమోదించారు. అజెండాలోని 11వ అంశంలో దేవాలయం ప్రాంగణంలోను, గూడూరు రోడ్డుకు ఇరువైపులా అంగళ్లు ఏర్పాటు చేసుకునే వారి నుంచి రుసుం వసూలు చేసుకునేందుకు నిర్వహించిన వేలంలో వెలిగట్ల వరప్రసాద్ రూ.11లక్షలకు పాడుకున్నారనే విషయం చర్చకు రాగా దీనిపై 12వ వార్డు కౌన్సిలర్ శివపావని ప్రశ్నించారు. వాహనాల పార్కింగ్ పాడుకున్నది వరప్రసాద్ అయితే పార్కింగ్ రుసుం బిల్లుపై మరొక పేరు ఉందని, అంతేకాకుండా అధికంగా వసూళ్లు చేశారని ఆరోపించారు. ఈ విషయమై తాను చేసిన ఫిర్యాదుపై ఎటువంటి చర్యలు తీసుకున్నారో తెలియజేయాలని కోరారు. దీనిపై మున్సిపల్ మేనేజర్ ప్రసాద్ సమాధానం ఇస్తూ విచారణ జరుగుతోందన్నారు. సీనియర్ కౌన్సిలర్ కటకం ప్రసాద్ మాట్లాడుతూ మున్సిపాలిటీకి ఆదాయం వచ్చే వాటిపై అధికారులు దృష్టి సారించాలన్నారు. సమావేశానికి కమిషనర్ ఎందుకు రాలేదని సభ్యులు ప్రశ్నించగా, కమిషనర్ మచిలీపట్నంలో అత్యవసర సమావేశానికి హాజరవడంతో తాను వచ్చినట్లు మేనేజర్ వివరించారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్‌లు ఎండీ ఖాజా, బైలపాటి జ్యోతి, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, ఆయా విభాగాలకు చెందిన మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

గోగినేనిపాలెం ఆధార్ క్యాంపునకు విశేష స్పందన



గోగినేనిపాలెంలో జరిగిన ఆధార్ క్యాంపులో సేవలందిస్తున్న డిజిటల్ అసిస్టెంట్లు

గోగినేనిపాలెం(ఘంటసాల): ఘంటసాల మండలం గోగినేనిపాలెం జెడ్పీ హైస్కూల్ ప్రాంగణంలో శనివారం నిర్వహించిన ఆధార్ క్యాంపునకు విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా గ్రామంలోని విద్యార్థులు, గ్రామస్తులతో పాటు పరిసర గ్రామాల ప్రజలు ఆధార్ క్యాంపునకు వచ్చి సద్వినియోగం చేసుకున్నారు. ఈ క్యాంపులో దేవరకోట, పాపవినాశనం గ్రామ సచివాలయాల డిజిటల్ అసిస్టెంట్లు ముదునూరి శివగంగ, బొద్దు శ్యామల, మహిళా పోలీస్ గాజుల అంకాలు సేవలను అందించారు. జెడ్పీ హైస్కూల్లో ఆధార్ క్యాంపు నిర్వహణకు సహకరించిన మండల విద్యాశాఖ, మండల పరిషత్, తహసీల్దార్ కార్యాలయ అధికారులకు హెచ్‌ఎం తమ్మన వేణుగోపాలరావు కృతజ్ఞతలు తెలిపారు.

కనుల పండువగా అయ్యప్ప గ్రామోత్సవం



అయ్యప్పకు పుష్పాభిషేకం చేస్తున్న పండితులు

కోడూరు: దివి శబరిమలగా పేరుగాంచిన కోడూరు హరిహరసుతుడి ఆలయం ప్రాంగణంలో 20వ మండల పూజోత్సవాల్లో భాగంగా శనివారం ప్రత్యేకంగా అలంకరించిన గజ వాహనంపై అయ్యప్ప గ్రామోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. కోడూరు, ఇస్మాయిల్‌బేగ్‌పేట, యర్రారెడ్డివారిపాలెం, కృష్ణాపురం గ్రామాల్లో ఊరేగింపు సాగింది. అయ్యప్ప మూలమూర్తికి చేసిన అలంకారం విశేషంగా ఆకట్టుకుంది. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త బడే భావన్నారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు. శుక్రవారం రాత్రి స్వామివారి మహాపడిపూజను అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. ప్రధానార్చకుడు కొమ్మూరి శ్రీనివాసశర్మ గురుస్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ కుమారుడు వెంకట్రామ్, అల్లుడు అశ్విన్‌కుమార్ దంపతులు ఉభయదాతలుగా వ్యవహరించి కలశపూజను జరిపారు. రాత్రి 11 గంటలకు మహా పడిహారతిని వెలిగించారు. పెడనకు చెందిన బాలాజీ గురుస్వామి బృందం ఆలపించిన అయ్యప్ప సంకీర్తనలు విశేషంగా ఆలరించాయి. ఆలయ అభివృద్ధికి సహకరించిన దాతలతో పాటు ఈ ఏడాది 18వ సారి పడియాత్ర చేస్తున్న దీక్షధారులను ఆలయ కమిటీ ఘనంగా సత్కరించింది. పడిపూజను పురస్కరించుకుని నిర్వహించిన లడ్డూ వేలం ద్వారా ఆలయానికి రూ.2లక్షల ఆదాయం సమకూరింది.

గోగినేనిపాలెం జెడ్పీ హైస్కూల్లో రాష్ట్రీయ బాల స్వస్థ్య కార్యక్రమం

గోగినేనిపాలెం(ఘంటసాల): ఘంటసాల మండలం గోగినేనిపాలెం జెడ్పీ హైస్కూల్లో గ్రామ ఆరోగ్య శాఖ సిబ్బంది ఆధ్వర్యంలో శనివారం రాష్ట్రీయ బాల స్వస్థ్య (ఆరోగ్య) కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హైస్కూల్లో 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు వైద్య పరీక్షలు చేసి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల బరువు, ఎత్తు, చెస్ట్, తల కొలతలు సేకరించి హిమోగ్లోబిన్ రక్త పరీక్షలు నిర్వహించారు. అనారోగ్యంతో ఉన్న విద్యార్థులను, పుట్టకతో వచ్చే లోపాలు ఉన్న విద్యార్థులను గుర్తించారు. అనారోగ్యం ఉన్న వారికి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మెరుగైన చికిత్స నిమిత్తం సంబంధిత ఆసుపత్రులకు రిఫర్ చేస్తామని ఏఎన్‌ఎం జె.శ్రీవాణి తెలిపారు. కార్యక్రమంలో హైస్కూల్ హెచ్‌ఎం తమ్మన వేణుగోపాలరావు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ టి.కళ్యాణి, ఆశ వర్కర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయంపై అవగాహన

తాడేపల్లి(ఘంటసాల): ఘంటసాల మండలం తాడేపల్లి గ్రామంలో బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థినులు శనివారం రైతులకు సేంద్రియ వ్యవసాయంపై అవగాహన కల్పించారు. అనంతరం రైతులకు జీవామృతం తయారు చేసే విధానాన్ని ప్రయోగాత్మకంగా చేసి చూపించారు.

ఎంపీడీఓపై దాడికి నిరసన



మోపిదేవి: అన్నమయ్య జిల్లా గాలివీడు ఎంపీడీఓపై జరిగిన దాడిని నిరసిస్తూ మోపిదేవి ఎంపీడీఓ ఆధ్వర్యంలో సిబ్బంది శనివారం నిరసన తెలిపారు. మధ్యాహ్న సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి అధికారులంతా దాడిని నిరసిస్తూ కొద్ది సేపు మౌనం పాటించారు.

మిరపలో సమగ్ర పంట యాజమాన్యంపై శిక్షణ

మోపిదేవి: మిరపలో వచ్చే వివిధ రకాల పురుగులు, తెగుళ్ల నివారణకు యాజమాన్య పద్ధతులు అవలంబించాలని కేవీకే సమన్వయకర్త డాక్టర్ డి సుధారాణి తెలిపారు. మండల కేంద్రం మోపిదేవి జెడ్పీ పాఠశాల ఆవరణలో మిరపలో సమగ్ర పంట యాజమాన్యంపై రైతులకు శిక్షణ కార్యక్రమం శనివారం నిర్వహించారు. సుధారాణి మాట్లాడుతూ ఖర్చును తగ్గించి అధిక దిగుబడి ఎలా పొందాలో వివరించారు. వివిధ రకాల రసం పీల్చు పురుగులు తెల్లదోమ, తామర పురుగు, నల్లిని ఎలా నివారించాలో ఉద్యానవన శాస్త్రవేత్త డాక్టర్ వి.మంజువాణి వివరించారు. తెల్లదోమకు జిగురు అట్టను ఏర్పాటు చేసుకోవాలని, తామర పురుగుకు ఫిప్రోనేల్ 2 మి.లీ. లీటరు నీటికి కలిపి పంటపై పిచికారీ చేసుకోవాలని సూచించారు. మత్స్యశాస్త్ర నిపుణుడు డాక్టర్ యశ్వంత్, బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థులు, రైతులు బొందలపాటి ప్రసాద్, కంఠంనేని మాధవరావు, రావి నాగేశ్వరరావు, రావి ప్రసాదరావు, కోనేరు ఆంజనేయప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తర చిరువోలులంకలో రెవెన్యూ సదస్సు

ఉత్తరచిరువోలులంక(మోపిదేవి): మండల పరిధిలోని ఉత్తర చిరువోలులంక గ్రామంలో పంచాయతీ కార్యాలయం వద్ద మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు నడకుదుటి జననీ కుమారి అధ్యక్షతన శనివారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో గ్రామానికి సంబంధించి ఒక్క అర్జీ వచ్చినట్లు తహసీల్దార్ శ్రీవిద్య తెలిపారు.

అర్ధరాత్రి వేళ వరికుప్పలకు మళ్లీ నిప్పు

- నక్కవానిదారి గ్రామంలో వరుసగా రెండవ రోజు ఘటన
- తీవ్ర ఆందోళనలో రైతులు
- రాత్రి వేళల్లో పొలాల వద్దే పడిగాపులు



దుండగులు తగలబెట్టిన వరికుప్ప

కోడూరు: రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటకు దుండగులు వరుసగా రెండవ రోజు కూడా నిప్పు పెట్టిన ఘటన కోడూరు మండలంలో చోటు చేసుకుంది. మండలంలోని లింగారెడ్డిపాలెం శివారు నక్కవానిదారి గ్రామానికి చెందిన అప్పికట్ల నాంచారయ్య అదే గ్రామంలో రెండు ఎకరాల్లో వరిపంటను సాగు చేశారు. వారం రోజుల క్రితం పంటను రెండు వరికుప్పలుగా వేశారు. అయితే శుక్రవారం అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని దుండగులు వెంకటేశ్వరరావుకు చెందిన వరికుప్పలకు నిప్పుపెట్టారు. వరికుప్పలు పూర్తిగా అగ్నికి ఆహుతయ్యాయి. శనివారం వేకువజామున పొలం వద్దకు వెళ్లిన వెంకటేశ్వరరావు వరికుప్పలు దగ్ధమై ఉండడాన్ని గమనించి కోడూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రూ.లక్ష మేర ఆస్తి నష్టం సంభవించినట్లు బాధిత రైతు తెలిపారు. గ్రామంలో గురువారం అర్ధరాత్రి అదే గ్రామానికి చెందిన అప్పికట్ల వెంకటేశ్వరరావు (బుజ్జి)కి సంబంధించి 2.5 ఎకరాల్లోని రెండు వరికుప్పలను గుర్తు తెలియని దుండగులు నిప్పు పెట్టారు. గ్రామంలో గత ఆరేళ్లుగా ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయి. గ్రామంలో జరుగుతున్న వరుస ఘటనలకు రైతులు భయపడి, పొలాల వద్దే కాపలాగా పడుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది.

ఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు, డాగ్ స్క్వాడ్

వరికుప్పలు దగ్ధమైన ప్రాంతాన్ని అవనిగడ్డ సీఐ యువకుమార్, కోడూరు ఎస్ఐ చాణిక్య పరిశీలించి వివరాలు సేకరించారు. బాధిత రైతులతో మాట్లాడి అనుమానితులను గుర్తించే పనిలో నిమగ్నమయ్యారు. మచిలీపట్నంకు చెందిన డాగ్ స్క్వాడ్ బృందం కూడా తనిఖీలు చేసింది.

కిశోర వికాసం బాలికల భవిష్యత్తుకు పునాది



కిశోర వికాసంపై మాట్లాడుతున్న సీడీపీవో సముద్రవేణి

పెడన: కిశోర వికాస కార్యక్రమం బాలికల బంగారు భవిష్యత్తుకు పునాది వేస్తోందని ఐసీడీఎస్ సీడీపీవో సముద్రవేణి అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలోని సమావేశం హాలులో శనివారం కిశోర వికాసం కార్యక్రమం అమలుపై అవగాహన, శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ బాలికల ఉజ్వల భవిష్యత్తుకు, ఆరోగ్యకరమైన, సాధికారిత దిశగా అడుగులు ముందుకు పడేలా మనమంతా సమష్టి కృషితో చేయూతనిద్దామన్నారు. 11 సంవత్సరాల నుంచి 18 ఏళ్ల వయసు కల బాలికలు చదువుపై దృష్టి పెట్టేలా అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. 18 ఏళ్లు నిండకుండా పెళ్లి చేసుకోకూడదని, ఈ వయస్సు లోపు వివాహాలు చేస్తున్నట్లు మీ దృష్టికి వస్తే తక్షణం సమీపంలోని పోలీస్ స్టేషన్లో లేదా ఐసీడీఎస్ అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు. డ్రాపౌట్స్ తిరిగి చదువుకునేలా ప్రోత్సహించడం, నైపుణ్యాభివృద్ధి, వృత్తి విద్య, ఉపాధి అవకాశాలు పెంచడం, రక్తహీనతను నివారించడం, బాల్య వివాహాలను అడ్డుకోవడం, యోగా, శారీరక వ్యాయామాన్ని ప్రోత్సహించడం తదితర వాటి గురించి తెలియజేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో ఎం.జయరామ్, పెడన పీహెచ్‌సీ వైద్యాధికారి మీనా కుమారి, వెలుగు ఏపీఎం శ్రీదేవి, ఎంపీడీవో కార్యాలయం ఏవో శ్రీదేవి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు శ్రావణి కుమారి, కల్పవల్లి, ఉపాధ్యాయులు, మహిళా పోలీసులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మాల్‌లో మందుబాబుల ఆగడాలు

- మహిళలను ఇబ్బంది పెడుతున్న తాగుబోతులు
- సోషల్ మీడియాలో వైరల్ అయిన వీడియో

మచిలీపట్నంటౌన్: నగరంలో కొద్ది నెలల క్రితం ఇంగ్లిషు చర్చి సమీపాన ప్రారంభించిన ఓ మాల్‌లో మందుబాబుల ఆగడాలు రోజురోజుకూ మితిమీరిపోతున్నాయి. మాల్‌కు వెళ్లే మహిళలకు రక్షణ లేకుండా పోతోంది. మందుబాబులు మద్యం మత్తులో మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారు. ఫలితంగా మాల్‌కు వెళ్లే మహిళలతో పాటు విధులు నిర్వహిస్తున్న మహిళలు కూడా ఇబ్బంది పడుతున్నారు. దీంతో మాల్‌లోని పీవీఆర్ థియేటర్‌లో సినిమాలు చూసేందుకు, ఇతర దుకాణాలలో షాపింగ్ చేసేందుకు వస్తున్న మహిళలు భయాందోళనకు గురవుతున్నారు. ఈ ఆకతాయిలు మాల్ యజమాని స్నేహితులే కావడం గమనార్హం. ఈ ఘటనలపై ఫిర్యాదు చేసినా తిరిగి తమపైనే దాడులకు దిగుతున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మాల్‌లో ఇటీవల ఇలాంటి ఘటనే ఒకటి చోటుచేసుకుంది. నగరానికి చెందిన దంపతులు ఇటీవల ఈ మాల్‌కు వెళ్లారు. మాటు వేసి ఉన్న ఓ మందుబాబు వీరు ఎటు వెళితే అటు వెళ్లడమే కాకుండా ఏకంగా ఆ మహిళ చెయ్యి పట్టుకుని లాక్కెళ్లే ప్రయత్నం చేయడమే కాకుండా అసభ్యంగా ప్రవర్తించడాన్ని చూసి ఆమె భర్త ఇదేమని ప్రశ్నిస్తే ఘర్షణకు దిగాడు. ఘటన పెద్దది కావటంతో చేసేది లేక మాల్ యజమానే రంగంలోకి దిగి గొడవకు కారణమైన తన స్నేహితుడిని దండించి మాల్ నుంచి పంపించి వేశాడు. ఈ ఘటనకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో సైతం వైరల్ అయ్యాయి. అయితే ఈ వీడియోలను ఆయా వాట్సప్ గ్రూప్‌ల నిర్వాహకులు కొద్ది నిమిషాల్లోనే తొలగించడం గమనార్హం. ఇప్పటికైనా పోలీసులు, సంబంధిత శాఖల అధికారులు మాల్‌లో మందుబాబుల ఆగడాలను నివారించేందుకు చర్యలు తీసుకోవాలని నగర వాసులు కోరుతున్నారు.

మున్సిపాలిటీకి వాటర్ ట్యాంకరు అందజేత



వాటర్ ట్యాంకర్‌ను ప్రారంభించిన మున్సిపల్ చైర్‌పర్సన్ నాగకుమారి తదితరులు

పెడన: పట్టణానికి చెందిన ఝాన్సీ కలంకారీ పరిశ్రమ అధినేత పిచ్చుక కోటేశ్వరరావు, హేమాక్షి దంపతుల పేరుతో కోటేశ్వరరావు శనివారం పెడన మున్సిపాలిటీకి వాటర్ ట్యాంకర్‌ను వితరణగా అందజేశారు. మున్సిపల్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం నాగకుమారి వాటర్ ట్యాంకర్‌తో పాటు 15వ ఆర్థిక సంఘ నిధులతో కొనుగోలు చేసిన నూతన ట్రాక్టర్‌ను ప్రారంభించారు. సీనియర్ కౌన్సిలర్ కటకం ప్రసాద్ మాట్లాడుతూ పిచ్చుక కోటేశ్వరరావు మున్సిపాలిటీకి రూ.2.50 లక్షలు విలువగల వాటర్ ట్యాంకర్‌ను అందించడం అభినందనీయమని అన్నారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు, యర్రా టార్జన్‌లను కటకం ప్రసాద్ దుశ్శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో సీనియర్ కౌన్సిలర్లు గరికిముక్కు చంద్రబాబు, పిచ్చిక సతీష్‌బాబు, కౌన్సిల్ సభ్యులు, మున్సిపల్ మేనేజర్ ఎంఆర్‌వీఆర్ ప్రసాద్, ఏఈ సీతారామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

అత్యాచార బాధితురాలికి మేయర్ పరామర్శ

మచిలీపట్నంటౌన్: నగరంలోని రాజుపేట ప్రాంతానికి చెందిన 13 ఏళ్ల మైనర్ బాలికను బైక్‌పై తీసికెళ్లి అత్యాచారానికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని నగర మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ డిమాండ్ చేశారు. నగరంలోని 36వ డివిజన్ పరిధిలోని రాజుపేట ప్రాంతానికి చెందిన 13 ఏళ్ల బాలికపై మద్యం, గంజాయి మత్తులో కాసానిగూడెంకు చెందిన ఐదుగురు యువకులు శుక్రవారం రాత్రి లైంగికదాడికి పాల్పడ్డారని వారిపై పోలీసులు పలు సెక్షన్‌లపై కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని ఆమె కోరారు. స్థానిక జిల్లా సర్వజన ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలికను, ఆమె కుటుంబ సభ్యులను మేయర్ వెంకటేశ్వరమ్మతో పాటు డెప్యూటీ మేయర్ శీలం భారతి, పలువురు కార్పొరేటర్‌లు, వైఎస్సార్‌సీపీ నాయకులు శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాణ్యమైన విద్యకు బదులుగా కూటమి ప్రభుత్వం నాణ్యమైన, చౌక మద్యం అందించేందుకే ప్రాధాన్యత ఇస్తోందని, ఫలితంగానే రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి రోజూ ఇలాంటి అకృత్యాలు జరుగుతున్నాయన్నారు. ఇలాంటి ఘటనలు జరక్కుండా పోలీసులు కఠినంగా వ్యవహరించాలని వారు కోరారు. బాలికను, ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించిన వారిలో డివిజన్ కార్పొరేటర్ మాచవరపు రాంప్రసాద్, మాజీ డెప్యూటీ మేయర్ లంకా సూరిబాబు, కార్పొరేటర్‌లు మేకల సుబ్బన్న, ఐనం తాతారావు, పల్లి శేఖర్, వైఎస్సార్ సీపీ నాయకులు గాజుల భగవాన్, మిరియాల రాంబాబు, బడే భానుతేజ, చిత్తజల్లు రాజు, ప్రదీప్ తదితరులు ఉన్నారు.